# ఆడబిడ్డలకు సర్కారు సారె

**బతుకమ్మ పండుగకు కానుకగా చీరెలు అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం**

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో దసరా పండుగకు ప్రత్యేక స్థానం ఉంది. దసరా ముందు నుంచే నిర్వహించే బతుకమ్మ పండుగ అంటే ఎంతో స్పెషల్. ఊరూవాడ, పల్లె, పట్నం అనే తేడా లేకుండా తెలంగాణ ఆడబిడ్డలంతా ఉత్సాహంగా బతుకమ్మను జరుపుకొంటారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆడబిడ్డల పండుగైన బతుకమ్మను ప్రభుత్వం ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నది. 2017 నుంచి బతుకమ్మ చీరెలను పంపిణీ చేస్తున్నది. ఈ సారి కూడా 18 ఏండ్లు నిండిన పేద మహిళలకు చీరెలను పంపిణీ చేయనున్నది. ఇప్పటికే సిరిసిల్ల, గద్వాలలో చీరెలు తయారయ్యాయి. జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారులు తయారు చేసిన ప్రతిపాదనలను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఉన్నతాధికారులకు పంపించారు. జిల్లాలో 2,69,004 మందికి బతుకమ్మ చీరెలను పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే జిల్లాకు 2,00,400 చీరెలు జిల్లాకు చేరాయి. ఇంకా 68,604 చీరెలు రావాల్సి ఉంది. జిల్లాకు చేరిన చీరెలను ఇటీవల మండలాలకు తరలించారు.

## ఏ మండలంలో ఎన్నంటే..?

అడ్డగూడూరు మండలంలో 10,006, ఆలేరు మండలంలో 9,055, ఆలేరు పట్టణంలో 5,552, ఆత్మకూరు (ఎం)లో 10,120, భువనగిరి మండలంలో 18,092, భువనగిరి పట్టణంలో 16,232, బీబీనగర్‌లో 16,232, బొమ్మలరామారంలో 13,092, చౌటుప్పల్ మండలంలో 16,256, చౌటుప్పల్ పట్టణంలో 10,221, గుండాలలో 11,861, మోటకొండూరులో 8,599, మోత్కూరు మండలంలో 5,895, మోత్కూరు పట్టణంలో 5,860, తుర్కపల్లిలో 12,262, నారాయణపురంలో 14,616, పోచంపల్లి మండలంలో 9,999, పోచంపల్లి పట్టణంలో 5,407, రాజాపేటలో 13,848, రామన్నపేటలో 18,794, వలిగొండలో 19,341, యాదగిరిగుట్ట మండలంలో 12,538, యాదగిరిగుట్ట పట్టణంలో 5,121మందికి బతుకమ్మ చీరెలు పంపిణీ చేయనున్నారు.



యాదగిరిగుట్ట ఎంపీడీఓ కార్యాలయానికి చేరిన రంగురంగుల బతుకమ్మ చీరెలు

## రకరకాల రంగులు.. 250 డిజైన్లు..

బతుకమ్మ చీరెలను మరింత నాణ్యత, విభిన్న డిజైన్లలతో తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తున్నది. అందులో భాగంగా ప్రతి సంవత్సరం అంతకంతకూ క్వాలిటీ పెంచుతున్నది. మహిళల నుంచి అభిప్రాయాలు సేకరించి చీరెలను తయారు చేయిస్తున్నది. పోయినసారి కంటే ఈ సారి మరింత ఆకర్షణీయంగా ఉండనున్నాయి. పొరపాట్లకు తావులేకుండా, ఎక్కడా వెనక్కి తగ్గకుండా ఈ సారి మరింత క్వాలిటీతో చీరెలను నేయించారు. సరికొత్త రంగులు, డిజైన్లతో రూపొందించారు. 250 డిజైన్లతో చీరెలను తయారు చేయించారు. ఈ సారి చీరెలకు డాబీ అంచు ఉండేలా, బుట్టాలు, జరీతో తయారు చేయించారు. ఆరు మీటర్ల పొడవుగల సాధారణ చీరెలకు అదనంగా వృద్ధ మహిళలు ధరించే తొమ్మిది మీటర్ల పొడవు గల చీరెలను కూడా నేయించారు.

## నేటి నుంచి ఎమ్మెల్యేల చేతుల మీదుగా..

జిల్లాలో ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు బతుకమ్మ చీరెల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. తొలి రోజు ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి చీరెలను పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. చీరెల పంపిణీకి జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, మున్సిపల్ వార్డుల వారీగా రేషన్ షాపులకు సమీపంలో పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 515 దుకాణాల్లో చీరెలను పంపిణీ చేస్తారు. గ్రామాల్లో రేషన్ డీలర్, పంచాయతీ కార్యదర్శి, మహిళా సంఘం ప్రతినిధులతో కూడిన కమిటీ, పట్టణాల్లో రేషన్ డీలర్, మున్సిపల్ బిల్ కలెక్టర్, మహిళా సంఘం కమిటీ ఆధ్వర్యంలో చీరెలను పంపిణీ చేస్తారు. ఆహార భద్రత కార్డును వెంట తీసుకొచ్చి మహిళలు చీరెలను తీసుకోవచ్చు.



యాదగిరిగుట్ట ఎంపీడీఓ కార్యాలయానికి చేరిన బతుకమ్మ చీరెలు

### 2,69,004 మందికి చీరెల పంపిణీ..

ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా బతుకమ్మ చీరెల పంపిణీ ఉంటుంది. జిల్లాలో 2,69,004 మందికి చీరెల పంపిణీ జరుగుతుంది. ఇప్పటికే 2,00,400 చీరెలను మండలాలకు తరలించాం. త్వరలో మిగతావి రానున్నాయి. ఈ సారి చీరెలు చాలా బాగున్నాయి. క్వాలిటీ, కలర్, వెరైటీ డిజైన్లు ఉన్నాయి. బుధవారం ఎమ్మెల్యేల చేతుల మీదుగా చీరెల పంపిణీ కార్యక్రమం ఉంటుంది.

– విద్యాసాగర్, చేనేత, జౌళిశాఖ ఏడీ

# బీఆర్‌ఎస్‌లో ఎన్నికల జోష్

**మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు పర్యటనలతో సమరోత్సాహం**

- నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల జాతర
- నిత్యం ప్రజాక్షేత్రంలోనే ఎమ్మెల్యేలు
- పెద్ద సంఖ్యలో ఇతర పార్టీల నుంచి వలసలు
- కదన కుతూహలంతో బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీఆర్‌ఎస్ మరోసారి అన్ని అసెంబ్లీ స్థానాల్లో గులాబీ జెండా ఎగురవేసేందుకు సిద్ధమవుతున్నది. గత ఎన్నికల్లో 9 అసెంబ్లీ స్థానాల్లో గెలవగా.. ఉప ఎన్నికల్లో విజయంతో అది 12కు చేరింది. త్వరలో జరుగబోయే ఎన్నికల్లో సైతం మరోసారి నల్లగొండ గులాబీ గడ్డగా చాటి చెప్పేందుకు ఉవ్విళ్లూరుతున్నది. పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ సిట్టింగ్ ఎమ్మెల్యేలనే గెలుపు గుర్రాలుగా భావిస్తూ వారికే మరోసారి అవకాశం కల్పిస్తూ అభ్యర్థులను ప్రకటించారు. అప్పటి నుంచే పార్టీ అభ్యర్థులంతా నియోజకవర్గాల్లో మరింత చురుకుగా వ్యవహరిస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో నిత్యం ప్రజల్లోనే ఉంటున్నారు. సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో జిల్లా మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సహకారంతో ఇప్పటికే నియోజకవర్గాల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ఇంకా మున్సిపాలిటీలు, గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను సైతం గుర్తిస్తూ వాటిని పూర్తి చేసే ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఆయా విభాగాల వారీగా సంబంధిత మంత్రులతో సంప్రదింపులు చేస్తూ రహదారులు, డ్రైనేజీలు, బ్రిడ్జిలు, కమ్యూనిటీ హాళ్లు.. ఇలా స్థానిక అవసరాల మేరకు నిధులను తీసుకొస్తున్నారు. ఇప్పటికే పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాలు, కొత్తగా చేపట్టే పనులకు శంకుస్థాపనలు చేస్తూ ఎమ్మెల్యేలు బిజీబిజీగా కనిపిస్తున్నారు. వీటికి తోడు దళితబంధు, బీసీబంధు, గృహలక్ష్మి వంటి సంక్షేమ పథకాల అమలుపైనా దృష్టి సారించారు. నియోజకవర్గంలో తమ మార్క్ అభివృద్ధిని చూపేలా ఎమ్మెల్యేలు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఇవన్నీ పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్తేజం నింపుతుండగా.. ఇతర పార్టీల శ్రేణులు సైతం ఆలోచనల్లో పడేలా చేస్తున్నాయి. దీంతో ఇతర పార్టీల నుంచి నిత్యం పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్‌లో చేరికలు జరుగుతున్నాయి.



## జోష్ నింపిన మంత్రుల పర్యటనలు

గత వారం రోజుల్లోనే నాలుగు నియోజకవర్గాల్లో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు పర్యటనలు పార్టీ శ్రేణుల్లో మరింత జోష్ నింపాయి. గత నెల 29న మంత్రి హరీశ్‌రావు, జిల్లా మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితో కలిసి నకిరేకల్, తుంగతుర్తి నియోజకవర్గాల్లో పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తూ నియోజకవర్గాల ప్రగతి నివేదన సభల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్, బీజేపీ వైఫల్యాలను ఎండగడుతూ.. కేసీఆర్ వచ్చాక జరిగిన అభివృద్ధిని వివరించారు. మిషన్ కాకతీయలో బాగైన చెరువులు.. మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలకుండా నాణ్యమైన కరెంటు, సరిపడా ఇస్తున్న ఎరువుల గురించి చెప్పారు. దీంతో తెలంగాణ రాష్ట్రం దేశానికి ధాన్యాగారమైతే, నల్లగొండ రాష్ట్రానికి దండిగా ధాన్యం ఇస్తున్నదని తెలిపారు. కాంగ్రెసోళ్లకు పదవుల మీద, పైరవీల మీద ప్రేమ.. వాళ్ల కడుపు నింపుకొనే ఆలోచనల మీద ప్రేమ.. ప్రజల కోసం ఏ ఆలోచనా చేయరని ప్రజలకు వివరించి చెప్పారు. రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి సోమవారం సూర్యాపేట, నల్లగొండ జిల్లా కేంద్రాల్లో పర్యటించి సుమారు రూ.1450 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా రోడ్‌షోలు నిర్వహించి ఐటీ హబ్‌లు ప్రారంభించగా ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. బహిరంగ సభకు వేలాదిగా తరలి వచ్చారు. 'తెలంగాణ రాకపోతే ఈ పనులు అయ్యేవా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటే ఇన్ని పనులు ఎన్నటికన్నా అవుతుండేనా? నల్లగొండ బాగుపడేనా.. దయచేసి గుండె మీద చేయి వేసి ఆలోచించాలి.' అని మంత్రి కేటీఆర్ చేసిన విజ్ఞప్తికి ప్రజలు ఈలలు, కేకలతో స్పందించారు. అధికారంలో ఉన్నప్పుడు మంత్రులుగా పనిచేసినా.. జిల్లాకు పరిశ్రమలు, ఐటీ హబ్, మెడికల్ కాలేజీలు తేలేదు. కరెంటు, సాగునీరు, తాగునీరు ఇవ్వకుండా సావగొట్టారని మండిపడ్డారు. ఇవ్వాళ ఊదరగొడుతూ.. ఉపన్యాసాలు ఇస్తున్నారని కాంగ్రెస్ నేతలపై మంత్రి కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్య, వైద్యం, సంక్షేమం, పట్టణ, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, కరెంటు.. ఇలా ఏ రంగాన్ని చూసినా సీఎం కేసీఆర్ అద్భుత పాలన అందిస్తున్నారని చెప్పారు. ఇలా మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ పర్యటనలు పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్తేజాన్ని నింపాయి. ఎన్నికలు ఎప్పుడొచ్చినా సత్తా చాటేందుకు బీఆర్‌ఎస్ శ్రేణులు సన్నద్ధమయ్యాయి.

## బీఆర్‌ఎస్‌లోకి వలసల వెల్లువ

బీఆర్‌ఎస్ అభ్యర్థుల ప్రకటన అనంతరం ఇతర పార్టీల నుంచి భారీగా వలసలు జరుగుతున్నాయి. కేసీఆర్ సర్కార్ చేసిన అభివృద్ధి పనులతో పాటు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలతో కాంగ్రెస్, బీజేపీ నుంచి పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారు. కొన్ని చోట్ల మరో పార్టీ లేకుండా ఊరంతా బీఆర్‌ఎస్ వైపే వస్తున్న సందర్భాలు కనిపిస్తున్నాయి. ముఖ్యమైన నేతలతోపాటు క్రియాశీలక కార్యకర్తలు బీఆర్‌ఎస్ వైపు ఆకర్షితులవుతున్నారు. పార్టీ విధానంపైనా బీఆర్‌ఎస్‌లో ఉన్నంత స్పష్టత ఇతర ఏ పార్టీలో లేకపోవడంతోనూ సమర్థవంతమైన పార్టీగా భావిస్తూ చేరుతున్నారు. కాంగ్రెస్, బీజేపీలు నేటికీ తమ అభ్యర్థులను తేల్చుకోలేకపోతున్నాయి. దీనికితోడు ఉన్న నేతల్లోనూ నిత్యం తగదాలే కనిపిస్తున్నాయి. దీంతో ఎవరికి టిక్కెట్టు వస్తుందో.. ఎవరికి రాదో తెలువని గందరగోళ పరిస్థితుల్లో విపక్షాలు ఉన్నాయి. బీఆర్‌ఎస్ కాదనుకున్న నేతలను చేర్చుకునే ప్రయత్నాలను కూడా కాంగ్రెస్ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. ఇన్నాళ్లు పార్టీ కోసం అన్ని విధాలుగా త్యాగాలు చేస్తూ వస్తే.. ఇప్పుడు వేరే వాళ్లకు టిక్కెట్ ఎలా ఇస్తారన్న ఆవేదనతో రగిలిపోతున్నారు. వీటన్నింటి నేపథ్యంలో ఆయా పార్టీల అధిష్టానాల తీరుపైనా, స్థానికంగా పార్టీలోని పరిణామాలపైనా తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తూ బీఆర్‌ఎస్ వైపు చూస్తున్నారు. దీంతో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల సమక్షంలో నిత్యం భారీగా చేరికలు జరుగుతున్నాయి. గులాబీ పార్టీ మరింత బలోపేతంగా రూపుదిద్దుకుంటున్నది.

# సరైన మందులతోనే సస్యరక్షణ

- అధిక వినియోగం అనర్థకం
- రోగాలకు తగిన మందులనే కొనుగోలు చేయాలి
- ఇంట్లో రసాయన మందులు నిల్వ చేయకూడదు
- మందుల పిచికారీలో జాగ్రత్తలు
- పాటించాలంటున్న వ్యవసాయ నిపుణులు



గరిడేపల్లి, అక్టోబర్ 3 : నాగార్జున సాగర్ ఆయకట్టుకు సాగునీరు రాకపోవడంతో ఇతర నీటి వనరులు ఉన్న రైతులు ఈ వానకాలం సీజన్‌లో తక్కువ విస్తీర్ణంలో వరి, ఇతర పంటలను సాగు చేశారు. అయితే.. అధిక దిగుబడులు సాధించాలన్న ఉద్దేశంతో రైతులు మోతాదుకు మించి రసాయన మందులను వాడుతున్నారు. ఈ క్రమంలో క్రిమిసంహారక మందులను సరైన పద్ధతుల్లో పిచికారీ చేయకపోవడంతో వారి ప్రాణాలకు ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నది. దీంతోపాటు పంటల్లో మందుల అవశేషాలు మిగిలి ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నది. పంటలపై వినియోగించే సస్యరక్షణ మందుల కొనుగోలు సరైన మోతాదులో మందు కలపడం, పిచికారీ వంటి విషయాల్లో జాగ్రత్తలు పాటించాలని గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త దొంగరి నరేశ్ సూచిస్తున్నారు.

- పంటలకు ముందుగా ఏ తెగులు, ఏ పురుగు సోకిందో గుర్తించాలి. ఆయా తెగుళ్లు, పురుగుల నివారణకు సరైన మందులను సిఫారసు మేరకు తెచ్చుకోవాలి. ఏ సమయంలో పిచికారీ చేయాలో, ఏ రకమైన మందులను కలిపి వాడుకోవచ్చో స్పష్టంగా తెలుసుకోవాలి.
- గుర్తింపు పొందిన కంపెనీల లేబుల్, సీల్ సరిచూసుకోవాలి. సీసాలకు మూతలు బిగించిన తర్వాత వేసిన సీల్‌ను పరిశీలించాలి.
- లైసెన్సు పొందిన దుకాణాల్లోనే మందులను కొనుగోలు చేయాలి. అవసరానికి మించి కొనుగోలు చేయవద్దు.
- మందులను ఇంటి వద్ద నిల్వ చేయడం క్షేమం కాదు. పురుగు మందులను ఎక్కువ కాలం నిల్వ చేస్తే వాటి సామర్థ్యం తగ్గిపోతుంది. కొనుగోలు చేసేటప్పుడు వాటి తయారీ తేదీని చూసుకోవాలి.
- తెగుళ్లు, పురుగు మందుల పనితీరు వేర్వేరుగా ఉంటుంది. వాటిని కలిపి వాడేటప్పుడు ఏ మందులో ఏది కలిస్తే సమర్థవంతంగా పని చేస్తుందో సూచించిన ప్రకారం వాడుకోవాలి. విచక్షణా రహితంగా అన్ని రకాల మందులను కలిపి పిచికారీ చేయకూడదు.

### పిచికారీ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పురుగు మందులను వాసన చూడకూడదు.
- పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో ఆహార పదార్థాలు తినడం, నీళ్లు తాగడం, చుట్ట, సిగరెట్ కాల్చడం వంటివి చేయకూడదు.
- పొడి మందులు ఉదయం 9గంటల్లోపు, సాయంత్రం నాలుగు గంటల తర్వాతనే పిచికారీ చేయాలి.
- మందులు పిచికారీ చేసేందుకు వాడే పరికరాలకు రంధ్రాలు లేకుండా జాగ్రత్త పడాలి.
- మందులు పిచికారీ చేయడం పూర్తయిన తర్వాత సబ్బుతో స్నానం చేయాలి.
- సీసా మూతలను నోటితో తీయడం, బకెట్లలో మందులు పోసి చేతులతో కలుపడం వంటివి చేయకూడదు.
- నీటిలో కరిగే పొడి మందులను ఒకేసారి నీటిలో పోసి కలుపకూడదు. మొత్తం మందు పొడిని కొద్ది నీటిలో పోసి క్రత్రతో కలిపిన తర్వాత మరికొంత నీళ్లు పోసి పలుచగా చేసి ఆ తర్వాత నిర్ణీత మొత్తం నీటిలో కలుపాలి.
- మబ్బులు పట్టి జల్లులు పడే సమయంలో, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు సస్యరక్షణ మందులు చల్లకూడదు. గాలి వీచే వైపు చల్లాలి. పంట పొలాల్లో గాలికి ఎదురుగా మందులు పిచికారీ చేయకూడదు.
- పిచికారీ చేసే సమయంలో మాస్కులు, గమ్‌బూట్లను, రబ్బరు గ్లౌజులను, పొడవు చేతి చొక్కాలను తలకు, నోటికి, ముక్కు వస్త్రాలు ధరించాలి.
- ఖాళీ మందు సీసాలను, డబ్బాలను కడిగి వాడవద్దు. వాటిని పాతి పెట్టాలి. మందులు పిచికారీ చేసిన తర్వాత కనీసం వారం, పది రోజుల వరకు పంటను కోయకూడదు.

### రోగాన్ని బట్టి మందులు వాడాలి



పంటలకు వచ్చిన రోగ లక్షణాలను పూర్తిగా పరిశీలించిన తర్వాత రోగాన్ని నిర్ధారించుకొని దానికి అవసరమైన మందులను మాత్రమే కొనుగోలు చేసి తగిన మోతాదులోనే పిచికారీ చేయాలి. గాలికి ఎదురుగా మందులను పిచికారీ చేయకూడదు. మబ్బులు పట్టినప్పుడు, ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు పిచికారీ చేయడం సరికాదు. తగు జాగ్రత్తలు పాటిస్తూ మందులను పిచికారీ చేస్తే పంట చేలపై రోగాలు నివారింపబడడమే కాకుండా పిచికారీ చేసే వారికి ఏ ఇబ్బందులూ ఉండవు. పెట్టుబడి ఖర్చులు కూడా తగ్గుతాయి.

– దొంగరి నరేశ్, కేవీకే శాస్త్రవేత్త, గడ్డిపల్లి

# అల్లరి

ALLARI

## చెప్పుకోండి



1. భూమికి అత్యంత సమీపంలో ఉన్న గ్రహం ఏది?
2. 1857లో సిపాయిల తిరుగుబాటు ఎక్కడ ప్రారంభమైంది?
3. అక్షాంశాలు, రేఖాంశాల్లో ఏవి కాలాన్ని సూచిస్తాయి?

## కథ: దొంగ దొరికిండు

**ఒక** ఊళ్లో ఇద్దరు వ్యాపారులు ఉండేవాళ్లు. వారిలో రహీం నూనెలు అమ్మేవాడు. సలీం కిరాణా సరుకులు, కూరగాయలు అమ్మేవాడు. వీళ్లు మొదట్లో మంచి స్నేహితులు. పక్కపక్కనే పోటీపడి వ్యాపారం చేస్తుండటంతో.. ఇప్పుడు ఇద్దరికీ క్షణం పడటంలేదు. ఒకరు మరొకరిపై గుర్రుగా ఉంటున్నారు. ఒకసారి పెద్ద గొడవ అయింది. ఎవరికి వాళ్లే ఊళ్లో పెద్దమనిషి దగ్గర ఫిర్యాదు చేశారు. "నేను నూనె అమ్ముకుంటుంటే.. ఈ సలీం వచ్చి నన్ను మాటల్లో పెట్టిండు. నేను ఇంట్లోకి పోయి వచ్చే సరికి.. నా గల్లపెట్టెలో పైసల మూటను మాయం చేసిండు. పైసాపైసా కూడపెట్టుకున్న సొమ్ము అది. దయచేసి నాకు న్యాయం చేయండి!" అని రహీం పెద్దమనిషితో మొరపెట్టుకున్నాడు. అంతా విన్న తర్వాత పెద్దమనిషి.. "ఇదంతా నిజమేనా!?" అని సలీంను అడిగాడు. "లేదు లేదు! ఆ పైసల ముల్లె నిజంగా నాదే!" అన్నాడు సలీం. ఇద్దరి వాదనా విన్నాక పెద్దమనిషి ఒక పరీక్ష పెట్టాడు. ఓ పళ్లెంలో నీళ్లు తెప్పించి, మూట విప్పి పైసలన్నీ అందులో పోశాడు. కొద్దిసేపటి తర్వాత ఆ పెద్దమనిషి సలీంను దొంగగా నిర్ధారించాడు. "అసలు దొంగ నువ్వే! నీకు రెండు వందల రూపాయల జరిమానా విధిస్తున్నా!" అని చెప్పి, పైసల మూటను రహీంకు అప్పగించాడు. అప్పుడు లబోదిబో మంటూ..

"తప్పయింది. క్షమించండి!" అని వేడుకున్నాడు సలీం. అయితే, సలీమే దొంగ అని పెద్దమనిషి ఎలా కనిపెట్టాడో అక్కడ ఉన్నవాళ్లకు అర్థం కాలేదు. అది గమనించిన పెద్దమనిషి.. "ఈ పైసలను నూనె దుకాణం నడిపే రహీమే పైసాపైసా కూడబెట్టాడు. అందుకే, వీటిని పళ్లెంలోని నీళ్లలో పోయగానే.. పైసలకంటిన నూనె నీళ్ల మీద తేలింది!" అని అసలు విషయం వివరించాడు.

• కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి



## పదసృష్టి



**కింద** ఇచ్చిన పదంలోని అక్షరాల సాయంతో ఎన్ని కొత్త పదాలను సృష్టించగలరో చూడండి.

Problem

Ex : Role

## టంగ్ ట్విస్టర్స్



Brisk brave brigadiers brandished broad bright blades, blunderbusses, and bludgeons balancing them badly.

## జవాబులు

చెప్పుకోండి : 1. శుక్రుడు, 2. మీరట్, 3. రేఖాంశాలు

ఏ పదముంది? : STAR

## స్నేహ సూక్తి


**ఇచ్చింది** మరిచిపోవడం, పుచ్చుకున్నది జ్ఞాపకం ఉంచుకోవడమే.. నిజమైన స్నేహం.

• మహాత్మా గాంధీ

## లిటిల్ హ్యాండ్స్


డి. నితిన్, కాట్రియాల





పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు, జోక్స్ మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం.
మా చిరునామా: zindagi@ntnews.com

## ఏ పదముంది?




ఇచ్చిన ఆధారాలను బట్టి సరైన పదాన్ని కనుక్కోండి.

## జతచేయండి

కింది బొమ్మలను వాటి సరైన నీడలతో జతచేయండి.

